క్లుప్తంగా

అన్నార్తుల ఆకలి తీర్చటం అభినందనీయం



మచిలీపట్నంటౌన్: అన్నార్తుల ఆకలి తీర్చేందుకు స్టార్ విద్యాసంస్థ ముందుకు రావటం అభినందనీయమని బందరు ఆర్డీవో ఎం.వాణి అన్నారు. నగరంలోని స్టార్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల సహాయ సహకారాలతో నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలకు 2,172 కిలోల బియ్యం, 225 లీటర్ల మంచినూనె, 108 కిలోల కందిపప్పును అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల మెంటార్ శ్రీరామ్, డైరెక్టర్ అయ్యప్పస్వామి, ప్రిన్సిపాల్ ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎస్ఐకు సత్కారం

కృత్తివెన్ను: విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటూ అందరి మన్ననలు పొందడం అనేది చాలా గొప్ప విషయమని పలువురు వక్తలన్నారు. కృత్తివెన్ను పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన గణేష్‌కుమార్ దంపతులను సోమవారం రాత్రి స్టేషన్ వద్ద దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై కొత్తగా స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐ కొల్లాటి నాగరాజుకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్, ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్న కుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో 'పల్లోటి' విద్యార్థినుల ప్రతిభ

పెడన: మచిలీపట్నంలో నోబుల్ విద్యాసంస్థలు నిర్వహించిన నోబుల్ స్పోర్ట్స్ మీట్‌లో పెడన పల్లోటి ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థినులు కళాశాల విద్యార్థినులతో పోటీ పడి విజేతలుగా నిలిచారని స్కూలు ప్రిన్సిపాల్ రాజీవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం డివిజన్ స్థాయిలో సోమవారం జరిగిన ఈ పోటీల్లో పల్లోటి స్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు సముద్రాల సాహితి, అమీనాసుల్తానా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని అన్నారు. కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి విజేతలుగా నిలిచిన విద్యార్థినులు, పీఈటీని ప్రత్యేకంగా అభినందించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎంయూడీఏ వీసీగా పీవీ రమణ



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంయూడీఏ) వైస్ చైర్మన్‌గా పీవీ రమణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం ఎంయూడీఏ వీసీగా నియమితులైన వెంకటేశ్వర్లును కోనసీమ జిల్లా డీఆర్వోగా నియమించారు. ఈ స్థానంలో బాపట్ల జిల్లా డీఆర్వోగా పనిచేస్తున్న పీవీ రమణను ఎంయుడీఏ వీసీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పాల్గొన్నారు.

పింఛనుదారుల వితరణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 22వ డివిజన్ ముస్తాఖాన్‌పేట యానాది కాలనీలో ఇటీవల వైఎస్సార్ సామాజిక పింఛను లబ్ధిదారుడు ఏలూరి భీమయ్య మృతి చెందాడు. తోటి పింఛనుదారులు తలో రూ.100 సాయంగా అందించి వచ్చిన రూ.8,400ను ఆయన కుమారుడు చినభీమయ్యకు మంగళవారం డివిజన్ కార్పొరేటర్ ఏకొరి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

పెడన: పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇప్పటికే పట్టాలు పొంది ఇళ్లు నిర్మించుకున్న, నిర్మించుకుంటున్న వారికి రిజిస్ట్రేషన్లు చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని పలువురు కౌన్సిలర్లు సచివాలయ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని 8వ సచివాలయాన్ని కౌన్సిలర్ కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్‌బాబు మంగళవారం సందర్శించి రిజిస్ట్రేషన్లు ఏ విధంగా జరుగుతున్నదీ తదితర విషయాలపై ఆరా తీశారు.

మా ప్లాట్లు మెరక చేస్తుంటే అభ్యంతరమేమిటి?

- పాగోలు, మేకావారిపాలెం లబ్ధిదారుల ఆవేదన
- టీడీపీ నాయకుల తీరుపై పేదల ఆవేదన
- తహసీల్దారుకు వినతిపత్రం సమర్పణ
- తహసీల్దార్, సీఐ చొరవతో పరిష్కారం



ఇరువర్గాలతో చర్చిస్తున్న తహసీల్దార్ సుమతి

చల్లపల్లి: తమ ప్లాట్లు ప్రభుత్వం మెరక చేస్తుంటే టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని పేదలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చల్లపల్లి మండలం పాగోలు, మేకావారిపాలెం జగనన్న కాలనీ లే-ఔట్ల లబ్ధిదారులు తమ స్థలాలు మెరక చేయించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతికి వినతిపత్రం సమర్పించారు. సరైన బాట లేని కారణంగా పాగోలు లే-అవుట్ లెవలింగ్ గత రెండేళ్లుగా జరగలేదు. ఇటీవల అధికారులు పాగోలు, మేకావారిపాలెం లే-అవుట్లు లెవలింగ్ పనులు చేపట్టారు. మండల పరిధిలోని నడకుదురు రేవు నుంచి గత కొద్ది రోజులుగా ఇసుక తరలించేందుకు అధికారులు ప్రయత్నించటం, టీడీపీ నాయకులు, నడకుదురు రైతులు అడ్డుకోవటం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం పాగోలు, మేకావారిపాలెం గ్రామాల లబ్ధిదారులు నడకుదురు రేవులోకి వెళ్లి ఆందోళన చేపట్టారు. దీంతో నడకుదురు టీడీపీ నాయకులకు, లబ్ధిదారులకు తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ సుమతి, పోలీసులు రంగప్రవేశం చేసి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇరు పక్షాలు రావాలని సూచించి ఆందోళన విరమింపచేశారు. మంగళవారం మధ్యాహ్నం పాగోలు, మేకావారిపాలెం లబ్ధిదారులు తమ స్థలాలు మెరక చేయించాలని తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. తహసీల్దార్ సుమతి, సీఐ సీహెచ్ నాగప్రసాద్ ఇరువర్గాలతో సమావేశమై చర్చించారు. ఇసుక బయటకు వెళ్లకుండా లే-అవుట్ అవసరాల వరకు మాత్రమే వెళ్లేలా శ్రద్ధ వహించాలని అధికారులు స్పష్టం చేశారు. దీంతో సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో పాగోలు, నడకుదురు సర్పంచ్‌లు తోట శ్రీనివాసరావు, గొరిపర్తి సురేష్, పాగోలు మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలల మండల వార్షిక క్రీడలు

30వ వార్షిక విద్యార్థులు, టీచర్ల క్రీడలకు శ్రీకారం



భావదేవరపల్లిలో ఉత్సాహంగా కబడ్డీ ఆడుతున్న చిన్నారులు

నాగాయలంక: మండల పరిషత్, మండల విద్యాకుటుంబం ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా నాగాయలంక మండల స్థాయిలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా నిర్వహిస్తున్న వార్షిక క్రీడల సబ్ జోన్ స్థాయి పోటీలు మండల పరిధిలోని ఆరు స్కూలు కాంప్లెక్స్‌లలో మంగళవారం ఉత్సాహంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక జెడ్పీ హైస్కూలు ఆవరణలో ఎంఈవో-1 టీవీఎం రామదాస్, ఎంఈఓ-2 అన్నపరెడ్డి రామారావు కాంప్లెక్స్ క్రీడలకు శ్రీకారం చుట్టారు. ఆరు కాంప్లెక్స్‌ల పరిధిలో విజేతలైన బాలికలకు నాగాయలంక హైస్కూలు గ్రౌండ్స్‌లో సెంట్రల్ జోన్ పోటీలుగా జరుగుతాయని కమిటీ చైర్మన్ అయిన ఎంఈఓ తెలిపారు. 40కి పైగా పాఠశాలల నుంచి 500 మందికి పైగా చిన్నారులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని, కబడ్డీ, నూండీ(కుందుళ్లు), ఖోఖో తదితర ఆటలు ఉంటాయన్నారు. భావదేవరపల్లి కాంప్లెక్స్‌లో చైర్‌పర్సన్ ఆకుల జ్యోతిర్మయి, తలగడదీవి హైస్కూలులో కాంప్లెక్స్ చైర్మన్, హెచ్ఎం బండ్రెడ్డి శివరామప్రసాద్ ఏటిమొగలో ఎస్ఎంసీ చైర్మన్ నాయుడు దావీదు, గణపేశ్వరంలో హెచ్ఎం బండ్రెడ్డి గోవర్ధన గోపాలకృష్ణ క్రీడలను ప్రారంభించారు. కబడ్డీ, నూండీ(కుందుళ్లు)ఆటలలో చిన్నారులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. ఆయా కాంప్లెక్స్‌ల సంయుక్త కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాల సమీపంలోని 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతులు జరుగుతాయన్నారు. 132 కేవీ మచిలీపట్నం- పామర్రు లైన్ (ఒక సర్క్యూట్) లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తామన్నారు. దీని వల్ల సాధారణ ప్రజలకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఏర్పాటు చేశామన్నారు. కాని అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమైతే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలోని చిట్టిపాలెం రోడ్డు, న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు గమనించి, సహకరించాలని భాస్కరరావు కోరారు.

పేద విద్యార్థినులకు రూ.10వేలు సహాయం

అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ పల్లెపాలెంకు చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు విద్యార్థినులకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. పల్లెపాలెంకు చెందిన శ్రావణి, రిషిత తల్లి గతంలో చనిపోగా, తండ్రి ఇటీవల మరణించారు. కట్ట నగోజీరావు జ్ఞాపకార్థం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్ను రంగారావు ఈ మొత్తాన్ని ఆ ఇద్దరు విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకుల బాబీ పాల్గొన్నారు.

ముస్లింలంతా వైఎస్సార్ సీపీతోనే...



మీడియాతో మాట్లాడుతున్న పఠాన్ కరిముల్లా ఖాన్

చల్లపల్లి: చల్లపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు, కార్యకర్తలు అందరూ వైఎస్సార్ సీపీలోనే ఉన్నారని వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి పఠాన్ కరిముల్లా ఖాన్ స్పష్టం చేశారు. స్థానిక బీసీ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్ కమాల్ ఇంటి వద్ద మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పఠాన్ మాట్లాడుతూ ఐదేళ్లకోసారి పార్టీలు మారే ఒక నాయకుడు ఇటీవల తమ పార్టీని వీడి జనసేనలోకి వెళ్లినంత మాత్రాన అతనితో ఎవరూ వెళ్లలేదన్నారు. అలాంటి నాయకుల వెంట చల్లపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏనాడూ నడవలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి చల్లపల్లిలో అత్యధిక శాతం ముస్లింలు వైఎస్సార్‌సీపీలోనే ఉన్నారని స్పష్టం చేశారు. తమ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు బాటలో నడిచి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి పూర్తి స్థాయి కృషి చేస్తామని ప్రకటించారు. సమావేశంలో ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకుడు అబ్దుల్ కమాల్, ఎంపీటీసీ సభ్యురాలు మహమ్మద్ షాహెదా బేగం, మాజీ సర్పంచ్ మహమ్మద్ ఫిరోజున్నీసా, జెడ్పీ హైస్కూల్ పీఎంసీ చైర్మన్ సయ్యద్ జహీర్, గ్రామ సచివాలయ కన్వీనర్ అబ్దుల్ సమీర్, మహమ్మద్ ఆరీఫ్, మైనార్టీ నాయకులు మహమ్మద్ ముజీబ్, సయ్యద్ రఫీ, మహమ్మద్ రఫీ, బేగ్, ఖాదర్, ఇమ్రాన్, షౌకత్, జిలానీ, హసేన్, కరిముల్లా బాషా, తదితరులు పాల్గొన్నారు.

కర్రసాములో ఈశ్వర్ అకాడమీ విద్యార్థులకు బంగారు పతకాలు



అవనిగడ్డ: సౌత్ ఇండియా కర్రసాము చాంపియన్‌షిప్ పోటీల్లో ఈశ్వర్ యూనివర్సల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు అకాడమీ నిర్వాహకురాలు ఈశ్వర్ తెలిపారు. నెల్లూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి 300 మంది విద్యార్థులు పోటీపడగా, కాడెట్ విభాగంలో జి.కౌషిక్ రెండు బంగారు పతకాలు, ఒక రజత పతకం, పి.భువన్ చంద్రారెడ్డి ఒక రజత, ఒక కాంస్య, ఫైట్, కటా విభాగంలో సీహెచ్ సాత్విక రెండు బంగారు పతకాలు, కేఎల్ఎస్ లాస్యశ్రీ ఒక బంగారు, ఒక రజత పతకం, జూనియర్ విభాగంలో ఎస్.జాహ్నవిశ్రీ రెండు బంగారు పతకాలు, టి.రవినాగ అరవింద్ ఒక బంగారు, ఒక రజత, సబ్ జూనియర్ విభాగంలో ఎం.ఫణి గిరిధర్ ఒక బంగారు, ఒక రజత, ఒక కాంస్య పతకం సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విజేతలను కర్రసాము అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పి.విశ్వ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ కెవి సుబ్బారావు పాల్గొన్నారు.


ఆక్వా చెరువులకు పట్టాలివ్వాలి

నాగాయలంక: బంజరు భూముల్లో సాగులో ఉన్న ఆక్వా చెరువులకు పట్టాలిచ్చి పేద వర్గాల రైతులను ఆదుకోవాలని మండల బీసీ నేత, ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు లంకె శ్రీనివాస వరప్రసాద్, అగ్నికుల క్షత్రియ నేత నాగిడి తాతారావుతో కలసి నాగాయలంక మత్స్య భవనం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగాయలంక, కోడూరు మండలాల్లో 15వేల ఎకరాల బంజరు భూముల్లో బడుగు, బలహీనవర్గాల రైతులు చెరువులతో జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. డీకేటీ పట్టాలు ఇవ్వని కారణంగా ప్రభుత్వ రాయితీలు పొందలేకపోతున్నారన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

మచిలీపట్నంటౌన్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నాయకులు కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వింత సంజీవరెడ్డి అన్నారు. నగరంలోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జిల్లా, మండల కమిటీలను 95 మందితో ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ డీసీసీ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కార్యాలయ పరిపాలన, మీడియా, మచిలీపట్నం నగర ఇన్‌చార్జ్‌గా నియమించి నియామకపత్రాన్ని అందజేశారు.

నేరుగా పథకాలిస్తున్న జగన్‌ను మరవొద్దు



పెనుమల్లిలో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్

పెడన: దళారులు, దళారీ వ్యవస్థ లేకుండా అర్హులైన ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలను అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరచిపోవద్దని, మళ్లీ సీఎంగా మీరంతా ముక్తకంఠంతో ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. మండలంలోని పెనుమల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం గడపగడపకు వైఎస్సార్ సీపీ ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి వారితో మాట్లాడి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పేదల జీవితాల గురించి ఆలోచన చేసే జగనన్నను ఎట్టి పరిస్థితిలో మరచిపోవద్దని కోరారు. ఈయనతో పాటు పెడన ఏఎంసీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, రాజులపాటి అచ్చుతరావు, శివరామ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు సుబ్బారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఓటర్ల చేర్పులపై సమాచారం ఇవ్వండి

పెడన: ఓటర్ల చేర్పులపై దరఖాస్తులుంటే వాటిని తమకు అందజేయాలని, వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి సక్రమంగా ఉంటే వాటిని ఓటర్ల జాబితాలో చేర్చుతామని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి(ఈఆర్వో) డి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో పాటు నియోజకవర్గంలోని తహసీల్దార్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఈఆర్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటర్ల చేర్పులు, మార్పులకు సంబంధించి సుమారు వంద దరఖాస్తులు వచ్చాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు.

నులిపురుగులపై విద్యార్థులకు అవగాహన

పెడన: నులిపురుగుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి, వాటి నివారణకు చేపడుతున్న చర్యలపై పాఠశాల అసెంబ్లీ సమయంలో విద్యార్థులకు తెలియజేయాలని డీఈఓ తాహెరాసుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 8 తేదీలలో అసెంబ్లీలో చెప్పడమే కాకుండా స్కూలు నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల అనుమతులు తీసుకున్న పిమ్మట 9న నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్‌బెండా జోల్ టాబ్లెట్‌లను ఇవ్వాలని తెలిపారు.

ఆకట్టుకున్న పరమవీర్‌చక్ర జవాన్ల చిత్రాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పరమవీర్ చక్ర భారత జవాన్ల చిత్రపటాల ప్రదర్శన ఆకట్టుకుంది. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన భారత జవాన్ల చిత్రాలను ప్రదర్శించి వాల్ ఆఫ్ హీరోస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఐ-సెట్ తరగతుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ ప్యానల్ గదిని ప్రారంభించారు. అనంతరం వీఎంసీ సమావేశం నిర్వహించి పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలను చర్చించారు. పరమవీర్‌చక్ర చిత్రాలను ఆంధ్ర హాస్పిటల్ ఈడీ కె.పూర్ణచంద్రరావు, వీఎంసీ కమిటీ సభ్యులు ఫణికుమార్, సుభాషిణి, రమణమ్మ, వరప్రసాద్, ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్, హెచ్ఎం జె.గ్లోరీ స్వరూపరాణి పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించిన అశోక్‌కుమార్

అవనిగడ్డ: చారిత్రక ప్రసిద్ధినొందిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని ఆరోగ్య భారతి అఖిల భారతీయ సంఘటనా కార్యదర్శి డాక్టర్ అశోక్‌కుమార్ వార్ష్ణేయ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శిల్పకళను ఆయన పరిశీలించారు. చోళరాజుల కాలంలో నిర్మితమైన ఈ ప్రాచీన ఆలయాన్ని సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

రిక్షా కార్మికులకు రిక్షా టాప్ కవర్లు అందజేత

అవనిగడ్డ: శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు రిక్షా కార్మికులకు రిక్షా టాప్‌కవర్లు అందించారు. సొసైటీ కార్యాలయంలో మంగళవారం పదిమంది రిక్షా కార్మికులకు టాప్‌కవర్లు అందజేశారు.

పాఠశాలకు గంట బహూకరణ

బంటుమిల్లి: మండల పరిధిలోని నాగన్నచెరువు పంచాయతీ శివారు నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామ ప్రముఖుడు కాటూరు సుందరయ్య 3 కేజీల ఇత్తడి గంట, క్లాస్‌రూము డివైడర్లను అందజేశారు.

సామాన్యుల చెంతనే జగనన్న సురక్ష ఆరోగ్య సేవలు

- నాగాయలంకలో రెండో విడత ఆరోగ్య సురక్ష సేవలు
- వైద్య శిబిరంలో 311మంది రోగులకు పరీక్షలు, ఉచిత మందులు



నాగాయలంకలో రోగులకు మందులు పంపిణీ చేసిన ఈఓపీఆర్డీ నరసమ్మ, వైద్యాధికారులు

నాగాయలంక: స్థానిక గ్రామ పంచాయతీల ఆవరణలో నాగాయలంక సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్ ప్రారంభించారు. ఎంపిడిఒ శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) సేవలతో పేదలు, సామాన్యుల చెంతకే వైద్యం అందుతోందని చెప్పారు. శిబిరంలో మొత్తం 311మందికి పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందజేసారు. వీరిలో 59 మందికి కంటి వెలుగు, ఆరుగురు గర్భిణులు, 18మంది పిల్లలు ఉన్నారు. వైద్యాధికారులు డాక్టర్ కె.శివరామకృష్ణ, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ తారకేశ్వరరావు, డాక్టర్ ఇంద్ర కుమార్ రెడ్డి, నేత్రవైద్యురాలు ఎం.శ్రీలక్ష్మి రోగులకు వైద్యపరీక్షలు జరిపారు.

503 మందికి వైద్య పరీక్షలు

గూడూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం లేళ్లగరువులో నిర్వహించిన శిబిరంలో 503 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ డి.మంజుష, డాక్టర్ హిమబిందు, డాక్టర్ మహిత, డాక్టర్ తరుణ్ రోగులను పరీక్షించారు. లేళ్లగరువు సచివాలయం పరిధిలోని లేళ్లగరువు, జక్కంచర్ల, కలపటం, గురిజేపల్లి గ్రామాల ప్రజలు వైద్య సేవలు పొందారు.

కంకటావలో జేసీ పర్యటన



కంకటావలో పంట పొలాలను పరిశీలిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

గూడూరు: జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ సోమవారం గూడూరు మండలం కంకటావలో పర్యటించారు. ముందుగా గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన జాయింట్ కలెక్టర్ రబీ ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. గూడూరు మండలంలో ఖరీఫ్, రబీలో ఏఏ పంటలు సాగు చేస్తారని స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్‌లో వరిసాగు చేస్తారని, రబీలో దాళ్వా లేకుంటే అపరాలు, వేరుశనగ వంటి పంటలు వేస్తారని ఏఓ జి.శివప్రసాద్ జేసీకి వివరించారు. ఈ క్రాప్ బుకింగ్‌లో వీఏఏలు నమోదు చేసిన పంట వివరాలను ఆమె సమీక్షించారు. అనంతరం జగనన్న శాశ్వత భూ రక్ష, భూ హక్కు పథకంలో భాగంగా గ్రామంలో నిర్వహించిన రీ సర్వే ప్రక్రియను సమీక్షించారు. స్టోన్ ప్లాంటేషన్ పాయింట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ ఎన్.పద్మావతి, ఏడీఏ మహీధర్, తహసీల్దారు ఎస్.ఎస్.శాంతి, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముఫ్తీ సల్మాన్ పై అక్రమ కేసులు రద్దు చేయాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ మాట్లాడుతున్న ముస్లింలు

మచిలీపట్నంటౌన్: గుజరాత్ జునాగఢ్‌లో నెల రోజుల క్రితం ఒక కార్యక్రమంలో ధార్మిక ప్రసంగం చేసిన వక్త ముఫ్తీ సల్మాన్ అజహరిపై గుజరాత్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను రద్దు చేసి అరెస్టు చేసిన ఆయన్ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ, ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో నగరంలోని ముస్లింలు మంగళవారం నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలను ధరించి స్థానిక రాజుపేట షాదీఖానా వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రసంగంలో సల్మాన్ అజహరి ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ చేసిన వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించి హిందువులను కించపరిచినట్లుగా ప్రసారం చేశారన్నారు. దీంతో గుజరాత్ ప్రభుత్వం అజహరిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసిందన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు బంటుమిల్లి జట్టు ఎంపిక



జిల్లా స్థాయి కప్పు అందుకున్న వాలీబాల్ జట్టుతో ఎంపీడీఓ, ఎంఈఓ

బంటుమిల్లి: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా మండల వాలీబాల్ జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని ఎంపీడీఓ వై.రామకృష్ణంరాజు, ఎంఈఓ త్రిపురసుందరీదేవి తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి కప్పు సాధించిన క్రీడాకారులను మంగళవారం వారు అభినందించారు. జిల్లా స్థాయిలో విజేతలకు ప్రభుత్వం రూ.60వేల ప్రైజ్ మనీని ప్రకటించింది. విశాఖపట్నంలో ఈ నెల 9 నుంచి 13 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుంది. విజేతలను గ్రామ సర్పంచ్ రేవు శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొక్కిలిగడ్డ కనకదుర్గ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మహేష్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు తిరుమాని శ్రీనివాసరావు, ఆడుదాం ఆంధ్రా మండల కన్వీనరు పీడీ మోహన్‌రావు అభినందించారు.